సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 7-8-2025

సంపుటి: 21 సంచిక: 116

పేజీలు: 8 వెల: రూ.1


## చేనేత వస్త్రాలు ధరించి పార్లమెంట్‌కు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేనత వస్త్రాలు ధరించి సైకిల్‌పై పార్లమెంట్ సమావేశాలకు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లాను ఆయన కార్యాలయంలో కలిసి చేనేత వస్త్రాలను బహూకరించి వాటి విశిష్టతను వివరించారు. అనంతరం చేనేతతో తయారుచేసిన శాలువాతో సత్కరించారు. చేనేతను ప్రోత్సహించాలని కోరారు.



## ఉందిగా కోర్టు సాకు..
# చేసేద్దాం ఆ సొమ్ముతో సోకు!

- ❖డైరెక్టర్ అనుమతి లేకుండానే ఎడాపెడా ఖర్చులు
- ❖ఒక కేసులో కోర్టు ఆదేశాలతో అవే నిధులతో చెల్లింపు
- ❖అదే అదనుగా ఇతరత్రా చిల్లర ఖర్చులన్నీ దాంతోనే
- ❖డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో నిర్వాకం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఒకసారి బట్టలు మాసిన తర్వాత ఎక్కడ కూర్చోడానికైనా ఆలోచించం. కుండకి ఓ పక్క చిల్లు పడిన తర్వాత అందులో నీరుండి ప్రయోజనమేమిటని భావిస్తాం. ఇవి ఎవరికైనా వర్తించే జీవిత సూత్రాలు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కూడా ఇటువంటి జీవన సూత్రమే కనిపిస్తోంది. ఓ బ్యాంకు డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ గానీ, అసలు గానీ వాడటానికి వీల్లేదన్న నిబంధనలున్నా కోర్టు ధిక్కార కేసు ఉంది కాబట్టి, ఆ మేరకు సొమ్ములు చెల్లించాలన్న నెపంతో బ్యాంకులో ఉన్న డిపాజిట్ తాలూకా వడ్డీని ఏడాది క్రితం కొంతమేరకు విత్‌డ్రా చేసిన వైద్య ఆరోగ్య శాఖ ఏవో బాబూరావు ఆ తర్వాత తన కార్యాలయ పరిధిలో ప్రతి ఖర్చును ఈ వడ్డీ సొమ్ముతోనే చేయిస్తున్నారు.

**వివరాల్లోకి వెళితే..** 2005లో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వైద్యఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు సర్జికల్, మెయింటినెన్స్ కోసం రూ.2 కోట్ల బడ్జెట్‌ను అప్పటి ప్రభుత్వం జిల్లాకు విడుదలచేసింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ, స్థానికంగా ఈ నిధులతో ఎటువంటి కొనుగోళ్లు జరపకూడదంటూ ఉత్తర్వులిచ్చింది. దీంతో హెడ్ అకౌంట్ 240 పేరిట ఈ నిధులు అప్పట్నుంచీ బ్యాంకులోనే ఉన్నాయి. ఇప్పుడు దాని మీద వచ్చిన వడ్డీయే దాదాపు రూ.2 కోట్లు ఉంది. కానీ దీన్ని విత్‌డ్రా చేసి ఖర్చు చేయాలంటే హెల్త్ డైరెక్టర్ అనుమతి ఉండాలి. గతంలో జిల్లా స్థాయిలో అనేక బిల్లుల చెల్లింపులకు ఈ వడ్డీని వాడుకుంటామంటూ ఆ కార్యాలయానికి లేఖలు రాసినా ఎటువంటి అనుమతులూ రాలేదు. కానీ 2024లో డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఏవోగా వచ్చిన బాబూరావు ఈ వడ్డీ డబ్బుల్లో రూ.18 లక్షలు హన్షిత ఎంటర్‌ప్రైజెస్‌కు చెల్లించారు. అలా ఎందుకు చేశారని ఆరాతీస్తే 2018లో ధనుంజయ రెడ్డి కలెక్టర్‌గా ఉన్నప్పుడు జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలకు బల్లలు, బెంచీలు, కుర్చీలు వంటివి కొనుగోలు చేయాలని నోట్ పెట్టి హన్షిత ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.18 లక్షలు విలువైన

- మిగతా చివరి పేజీలో



- ▸▸వాటికి జిల్లాలో అందిన దరఖాస్తులు ఏడువేలుపైనే
- ▸▸ఆమోదం పొందినవాటి సంఖ్య 4903 మాత్రమే
- ▸▸కార్డు స్ప్లిట్‌కు అవకాశం లేక చాలామంది నిరాశ
- ▸▸మార్పులు, చేర్పులకు మొత్తం 72,512 దరఖాస్తులు



## కొత్తకార్డుల
# సంతోషం సగమే!

కొత్త రేషన్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఫిక్స్ చేయడంతో జిల్లాలో ఎన్ని కొత్త కార్డులు మంజూరుయ్యాయన్న ఆసక్తి పెరిగింది. దరఖాస్తు చేసుకున్నవారు దాని కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే జిల్లాలో కొత్త కార్డులకు అందిన దరఖాస్తుల్లో సగానికి కాస్త ఎక్కువ మాత్రమే ఓకే అయ్యాయని అధికారవర్గాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నెల 25 నుంచి ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నారు. దీనికి ముందు ప్రస్తుత కార్డుల్లో మార్పులు, చేర్పులు, విభజనతో పాటు కొత్త కార్డులకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా కొత్త తెల్లకార్డుల కోసం 7,192 దరఖాస్తులు అందాయి. కానీ వాటిలో 4,903 దరఖాస్తులను మాత్రమే ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిసింది. మరోవైపు 45 మంది మాత్రమే తెల్లకార్డులను ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఏడాది మే ఏడో తేదీ నుంచి బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కానీ హౌస్ హోల్డ్ స్ప్లిట్‌కు.. అంటే ఒకే కుటుంబంలోని సభ్యులు పెళ్లి చేసుకోవడం, వాటాలు వేసుకుని విడిపోయి వేరు కాపురాలు పెట్టిన వారు ఉమ్మడి కుటుంబం నుంచి తమ పేర్లు తొలగించి.. కొత్త కార్డులు పొందే ఆప్షన్ ఇవ్వకపోవడం వల్ల చాలామంది కొత్త కార్డులకు నోచుకోలేకపోయారు. వైకాపా హయాంలో 2023లో నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వేను ఆధారంగా చేసుకొని కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తుండటం కూడా కొత్త కార్డుల మంజూరుకు కొంత ప్రతిబంధకంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, రైస్‌కార్డు విభజన, కార్డు సరెండర్, ఆధార్ సరి చేయడం వంటి అంశాలకూ అవకాశం కల్పించడంతో సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా అందిన వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హులైన వారి జాబితాలను తహశీల్దార్లు తమ లాగిన్ నుంచి ప్రభుత్వానికి పంపించడంతో ప్రభుత్వం తుది ఆమోదం తెలిపింది.

**ఆనందం ఆవిరి**

జిల్లాలో మొత్తం 6,57,758 బియ్యం కార్డులు ఉన్నాయి. వీటిలో సుమారు 19.50 లక్షల మంది (యూనిట్లు) సభ్యులు ఉన్నారు. బియ్యం కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేసిన తర్వాత అనర్హులను గుర్తించడం


- మిగతా చివరి పేజీలో

## పలాస కేంద్రంగా..
# కొత్త జిల్లా?

- -మరోసారి జిల్లాల పునర్విభజనకు సర్కారు సిద్ధం
- -కేబినెట్ భేటీలో స్పష్టత ఇచ్చిన సీఎం చంద్రబాబు
- -నెల రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీకి ఆదేశాలు
- -రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 32కు పెరిగే అవకాశం
- -పలు జిల్లాల కేంద్రాలు, పరిధులు కూడా మారే ఛాన్స్

జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. బుధవారం జరిగిన కేబినెట్ మీటింగులో ఈ అంశం ప్రస్తావనకు రాగా దీనిపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని గతంలోనే నియమించిన మంత్రివర్గ ఉప సంఘాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్ధనరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీని ఏర్పాటు చేసినప్పుడే వైకాపా హయాంలో జరిగిన జిల్లా విభజన ప్రక్రియలో మరికొన్ని మార్పులు చేయనున్నారని స్పష్టమైంది. కాగా తాజా కేబినెట్ భేటీలో చర్చించిన ప్రకారం.. ఆయా ప్రాంతాల్లో కొత్త జిల్లాల డిమాండ్లు, జిల్లా పరిధి మార్పు.. వాటికి అనుగుణంగా నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీల సరిహద్దుల విషయంలో కూడా ప్రజల నుంచి అందే డిమాండ్లకు అనుకూలంగా మార్పులు చేర్పులతో నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీని ప్రకారం ప్రస్తుతం ఉన్న జిల్లాల్లోని పలు నియోజకవర్గాలు ఇతర జిల్లాల్లోకి వెళ్లడంతో పాటు కొత్త జిల్లాలు కూడా ఏర్పాటు కానున్నాయి. మళ్లీ వాటి పరిధిలోకి కొన్ని నియోజకవర్గాలు చేరనున్నాయి. గత వైకాపా ప్రభుత్వం ఒకటి రెండు చోట్ల మినహా లోక్‌సభ నియోజకవర్గాలనే జిల్లాలుగా మార్చింది. ఆ ప్రకారం రాష్ట్రంలో 25 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా 26 జిల్లాలు ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ ప్రాతిపదికను కాదని ప్రజల డిమాండ్లు, అవసరాలకు అనుగుణంగా జిల్లాలను పునర్విభజించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలను 32కు పెంచాలని స్థూలంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.


- డి.వి.రమణ,
సత్యం ప్రత్యేక ప్రతినిధి


### కొత్త జిల్లాలకు డిమాండ్లు

గత ప్రభుత్వం జిల్లాలను విభజించినప్పుడే పలు ప్రాంతాల్లో అభ్యంతరాలు, కొత్త డిమాండ్లు వ్యక్తమయ్యాయి. కానీ నాటి ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. వాటిని పరిగణనలోకి తీసుకోవడంతోపాటు మళ్లీ తాజాగా విజ్ఞప్తులు స్వీకరించి, మార్పులు చేర్పులు సూచించడం కేబినెట్ సబ్ కమిటీ బాధ్యత.

-అమరావతి ప్రాంతాన్ని రాష్ట్రానికి ఏకైక రాజధానిగా ప్రకటించి, అనేక నిర్మాణాలు చేస్తున్నందున గుంటూరు, క్రిష్టా జిల్లాల మధ్యనున్న అమరావతి ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా ప్రకటించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రాజధాని ప్రాంత అభివృద్ధి వేగం పుంజుకోవడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే అమరావతి జిల్లా పరిధిలోకి పెదకూరపాడు, తాడికొండ, మంగళగిరి, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలు చేరనున్నాయి.

-శ్రీకాకుళం జిల్లాలో మొన్నటి విభజనలో రాజాం నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో, పాలకొండ నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపారు. మిగతా ఎనిమిది నియోజకవర్గాలను శ్రీకాకుళం జిల్లాలో ఉంచారు. కాగా పలాస కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. దీనికి ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నట్లు రాజధానివర్గాల సమాచారం. పలాసతోపాటు పాతపట్నం, టెక్కలి, ఇచ్ఛాపురం అసెంబ్లీ సెగ్మెంట్లను విడదీసి పలాస జిల్లాను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

-ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురం కేంద్రంగా యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి, మార్కాపురం, గిద్దలూరు అసెంబ్లీ సెగ్మెంట్లను కలిపి మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఐదేళ్ల నుంచీ ఉంది.

-నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలను కలిపి నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు చేశారు. కానీ తాజాగా గూడూరు కేంద్రంగా సర్వేపల్లి, వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలతో ఒక జిల్లా, మదనపల్లె కేంద్రంగా పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలుపుతూ మరో జిల్లాను ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి.

### జిల్లా కేంద్రాల మార్పు

-ఉమ్మడి అనంతపురం జిల్లాను వైకాపా సర్కారు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలుగా విభజించింది. సత్యసాయి జిల్లాకు పుట్టపర్తిని కేంద్రంగా చేసింది. అయితే ఆ జిల్లాకు హిందూపురాన్ని కేంద్రంగా మార్చాలన్న డిమాండ్లు అప్పట్లోనే వెల్లువెత్తాయి. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సత్యసాయి జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

-ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి, రాజంపేట.. చిత్తూరు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలను కలిపి రాయచోటి కొత్తగా అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేయగా.. ఆ జిల్లాకు రాజంపేటను కేంద్రంగా చేయాలని డిమాండ్ చేస్తూ అప్పట్లో చాలా పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

-ఉమ్మడి కర్నూలు జిల్లాను పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విభజించారు. కానీ వాటికి అదనంగా ప్రముఖ వాణిజ్య ప్రాంతమైన ఆదోని కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అది సాకారమైతే.. పత్తికొండ, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలు ఆదోని జిల్లాలో చేరే అవకాశం ఉంది.

-ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను విడదీసి ఏలూరు కేంద్రంగా ఏలూరు జిల్లా, భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పాటు చేశారు. కానీ కొత్త పశ్చిమ గోదావరి జిల్లాకు భీమవరం కాకుండా నరసాపురాన్ని కేంద్రంగా ప్రకటించాలన్న డిమాండ్ ఉంది.

-గతంలో కృష్ణా జిల్లాలో ఉండి.. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో చేరిన నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను తిరిగి కృష్ణా జిల్లాలోనే కలపాలన్న డిమాండ్లు ఉన్నాయి.

-అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న వై.రామవరం మండలాన్ని విభజించి కొత్త మండలం ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలిస్తోంది.

• ఎడిటోరియల్

# చట్టం కొందరికే చుట్టం!

చట్టం ముందు అందరూ సమానమేనంటారు. ధనిక, పేద, కులం, మతం, బంధుత్వం వంటివేవీ చూడకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందంటారు. కానీ వాస్తవాలను గమనిస్తే.. కొందరిని మాత్రం ఎక్కువ సమానులుగా పరిగణిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. కావాలంటే వివాదాస్పద దేరాబాబా ఉదంతాన్నే చూడండి.. తన శిష్యురాళ్లిద్దరిపై అత్యాచారం చేయడం, హత్య వంటి తీవ్ర అభియోగాలు రుజువు కావడంతో హర్యానా రాష్ట్రం రోహ్‌తక్‌లోని దేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్‌రహీమ్ సింగ్ అలియాస్ దేరాబాబాకు 2017లోనే కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అప్పటనుంచీ ఆయన ఒకటి రెండుసార్లు కాదు.. ఏకంగా 14సార్లు పెరోల్‌పై బయటకొచ్చారు. తాజాగా ఆయనకు మరోసారి 40 రోజుల పెరోల్ మంజూరైంది. దాంతో ఆయన అత్తారింటికి వచ్చీపోయినట్లు రాకపోకలు సాగిస్తున్నారు. దర్జా అనుభవిస్తున్నారు. మరోవైపు చూస్తే 90 శాతం అంగవైకల్యం కలిగిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను నక్సల్స్ నిరోధక చట్టం ప్రయోగించారు. ఆయన దోషిత్వం నిరూపితం కాకపోవడంతో విచారణ ఖైదీ(అండర్ ట్రయల్)గా పరిగణించకుండా కరెంటు కూడా లేని అండా (కోడిగుడ్డు ఆకారంలో ఉండే సెల్) జైల్లో నిర్బంధించి, కనీసం బెయిల్ కూడా దొరక్కుండా చేసి పరోక్షంగా ఆయన మరణానికి కారణమయ్యారు. చట్టం ముందు అందరూ సమానం కాదని.. కొందరు ఎక్కువ సమానం.. ఇంకొందరు అతి తక్కువ సమానం అన్నది.. ఈ రెండు ఉదంతాలతోనే తేటతెల్లమైపోతోంది. దీన్నే ఇంకోలా చూస్తే.. తీవ్రమైన నేరాల్లో శిక్ష పడిన దేరాబాబా లాంటివారు తమకు కావలసినప్పుడల్లా పెరోల్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేస్తూ రాజభోగాలు అనుభవిస్తుంటే.. ఎటువంటి పలుకుబడి, ధనబలం లేని లక్షలాది అండర్ ట్రయల్ నిందితులు నెలలు, ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గిపోతున్నారు. శిక్ష పడిన 2017 నుంచి నేటి వరకు ఎనిమిదేళ్లలోనే దేరాబాబా సుమారు 40 సార్లు పెరోల్‌పై బయటకొచ్చారు. ఇలా వచ్చిన ప్రతిసారీ కనీసం 20 రోజుల వరకు బయట ఉంటున్నారు. అంటే ఆయన విషయంలో పెరోల్ నిబంధన ఎంతగా దుర్వినియోగమైందో అర్థం చేసుకోవచ్చు. దీనికి విరుద్ధంగా విచారణ ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న నిందితులకు బెయిల్ మంజూరుచేసే విషయంలో మాత్రం ట్రయల్ కోర్టులు సాచివేత ధోరణి అవలంభిస్తున్నాయి. ఇది తెలియనివారు చేసిన ఆరోపణ కాదు. సాక్షాత్తు దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టే ఈ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ.. కేసుల్లో నిందితులకు బెయిల్ ఇచ్చే విషయంలో ట్రయల్ కోర్టులు తమ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నాయని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా రాజకీయ సంబంధిత కేసుల్లో ఎవరికి వారు ఎవరికివారు మనకెందుకులే అన్నట్లు తప్పుకొనే ధోరణిలో వ్యవహరించడం వల్ల నిందితులు అకారణంగా జైళ్లలోనే మగ్గిపోవాల్సి వస్తోంది. డబ్బు, పలుకుబడి ఉన్న వారు మాత్రం ఎంత పెద్ద కేసుల్లో ఉన్నా.. బడా లాయర్లను పెట్టుకుని ఏ సమయంలోనైనా కోర్టుల తలుపు తట్టి బెయిల్ తెచ్చుకోగలుగుతున్నారు. ఇవేవీ లేని సామాన్యులపై కేసులు నమోదైతే మాత్రం లాయర్లను పెట్టి వాదించుకునే స్తోమత లేకపోవడం, అలాగే ఇటువంటి వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయ సహాయం అందించాలన్న నిబంధన ఎక్కడా అమలు కాకపోవడం వల్ల తప్పు చేయకపోయినా.. చాలామంది నిందితులు కేసుల్లో ఇరుక్కుని జైళ్లలో మగ్గిపోతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వద్ద ఉన్న గణాంకాలు కూడా దీన్నే నిర్ధారిస్తున్నాయి. 2018 నుంచి 2022 నాటికి దేశవ్యాప్తంగా విచారణకు ఎదురుచూస్తున్న అండర్ ట్రయల్స్ సంఖ్య 1.40 లక్షల మేరకు పెరిగి 4,34,302 నుంచి 5,73,220కు చేరింది. జైళ్లలో ఉన్న ఖైదీల్లో వీరే 75.8 శాతం మేరకు ఉన్నారని తేలింది. వీరిలో ఐదేళ్లకుపైగా విచారణ ఎదుర్కొంటున్న వారి సంఖ్య సుమారు 11వేలు. ఇక ఏడాదికి మించి విచారణ పేరుతో జైళ్లలో ఉంటున్నవారి సంఖ్య లక్షల్లోనే ఉంది. అండర్ ట్రయల్ ఖైదీలతో జైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. దేశంలోని జైళ్లు 4,36,266 మందిని ఉంచే సామర్థ్యం కలిగి ఉండగా ప్రస్తుతం 5,73,220 (131 శాతం) మందిని అవే సెల్స్‌లో కుక్కేశారు. ఒకవైపు బుల్డోజర్లు పెట్టి ఎలాంటి విచారణ లేకుండానే క్రిమినల్స్ అన్న ముద్ర వేసేసి శిక్షలు విధించేస్తున్న నియంతృత్వ ధోరణి.. మరోవైపు తమ భావజాలానికి, తమ రాజకీయ పెత్తనానికి అవరోధంగా ఉన్న వారిని ఏదో సాకుతో జైళ్లలోకి నెట్టేసే అనధికార ఎమర్జెన్సీ పోకడలు దేశ ప్రజాస్వామిక పునాదులకు గొడ్డలిపెట్టులాంటివే.

# ఇంటర్న్‌షిప్‌పై అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో "ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్" సంస్థ సీఈవో ఆర్.శివకుమార్ "కెరీర్ అవేర్‌నెస్&ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్"పై విద్యార్థులకు బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు, కార్పొరేట్ ట్రైనింగ్‌లు, కన్సల్టింగ్ సేవలు, ఇండస్ట్రీ సహకారం, జాబ్ ప్లేస్‌మెంట్‌లు వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలు తీర్చారు. బిఏ హిస్టరీ విద్యార్థిని నందిని పేదలకు సేవ చేయాలనే తన అభిప్రాయాన్ని వెల్లడించడంతో, శివకుమార్ ఆమెకు నగదు బహుమతి అందించి, ఆ మొత్తంతో పేదలకు సహాయం చేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలవాలని, విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల మరియు ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మధ్య ఎం.ఓ.యు (మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు శిక్షణ, అవకాశాలు, పరిశ్రమ అనుభవం అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చేనేతకు భారతదేశంలో ప్రత్యేక స్థానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



భారతదేశంలో చేనేత పరిశ్రమకు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ప్రజలకు, ముఖ్యంగా చేనేత కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ జీవిత శైలిని ప్రతిబింబించే ఈ రంగం దేశ ఆర్థిక, సాంస్కృతిక పురోగతిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చేనేత ఉత్పత్తులలో ఉన్న నైపుణ్యం, విలక్షణతకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించే దిశగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. వ్యవసాయం తర్వాత వేలాది మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందని, అలాంటి రంగానికి అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం నేటి నుంచి ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారాన్ని భరించనుందన్నారు. దీంతో పాటు త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ.5 కోట్లు విడుదల చేయనుందన్నారు. చేనేత కళను ప్రోత్సహిస్తూ, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

### ఎచ్చెర్ల ఎమ్మెల్యే శుభాకాంక్షలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేనేత కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మ నిర్భర భారత్‌కు ఆధారం చేనేత అని, ఇది మన సంస్కృతి, శ్రమజీవుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. చేనేత కళను గౌరవించాలి, వారి జీవనోపాధికి తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. మన చేనేత మన గౌరవం– స్వదేశీ వినియోగమే దేశాభివృద్ధికి మార్గం అని ఎమ్మెల్యే అన్నారు.

# 8న సౌభాగ్యం ప్రత్యేక కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న సౌభాగ్యం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ ఆర్గనైజర్ ఎం.లలితామణి పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేటలోని ఏకోత్తర శ్రీ చక్ర పీఠం దేవి ఆశ్రమంలో మహిళలతో అధిక సంఖ్యలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు దేవస్థానం ఆధ్వర్యంలో గాజులు పసుపు కుంకుమ రక్షకంకణాలు, జాకెట్, నల్లపూసలు, పుస్తక ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# మాస్టర్‌ప్లాన్ ఆమోదంపై ఎమ్మెల్యే హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం నగర పాలక సంస్థలకు సంబంధించి గతంలో జారీ చేసిన జీవో నెంబర్ 147 ప్రకారం రాష్ట్ర పుర పరిపాలన, పట్టణ అభివృద్ధి శాఖ మాస్టర్ ప్లాన్ ఆమోదించడం పట్ల ఎమ్మెల్యే గొండు శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత నగర భవిష్యత్తు దృశ్య కొన్ని రహదారులను వెడల్పును పెంచుతూ, మరికొన్ని నివాసిత ప్రాంతాలను బహుళ వినియోగ ప్రాంతాలుగా మారుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చారన్నారు. శ్రీకాకుళం నగరం పాలక సంస్థ విస్తీర్ణం 53.17 చదరపు కిలోమీటర్లు పరిధిలో జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ ఆమోదించినట్లు ఆయన వివరించారు. మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ ఆమోదం పొందిన మాస్టర్ ప్లాన్ పట్టణ ప్రజల పరిశీలనార్థం ఆరు నెలలపాటు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణకు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.



రుహానీ శర్మ ప్రతిభావంతులైన నటి. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా యాక్టివ్‌గా ఉంటుంది. ఆమె పోస్ట్ చేసే ప్రతి లుక్‌లోనూ ఆమె అందంగా కనిపిస్తుంది. ఆధునిక లేదా సాంప్రదాయ దుస్తులలో ఉన్నా, ఆమె అందంగా కనిపిస్తుంది. ఆమె తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా పంచుకుంటుంది. రుహాని 2013లో తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆమె మొదట పంజాబీ మ్యూజిక్ వీడియోలలో కనిపించింది. ఈ వీడియోలు అమ్మి విర్క్ రాసిన థెకా, క్లాస్‌రూమ్ మరియు కుడి తు పటాకా. ఆమె తన అందానికి త్వరగా దృష్టిని ఆకర్షించింది. 2018లో, ఆమె తెలుగు సినిమా రంగ ప్రవేశం చేసింది. ఆమె మొదటి చిత్రం చి లా సౌ. ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. ఆమె నటన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆమె పరిశ్రమలో కొత్త నటిగా మారింది. 2019లో, ఆమె మలయాళంలో అరంగేట్రం చేసింది. ఆమె థ్రిల్లర్ కమలలో నటించింది. ఈ చిత్రానికి రంజిత్ శంకర్ రచన, దర్శకత్వం వహించారు. రుహాని తెలుగు చిత్రాలలో తన నటనను కొనసాగించింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

# ఘాటీ ట్రైలర్: సీత చేసే లంకా దహనం

క్రిష్ ఆలోచనలు కొత్తగా ఉంటాయి. ఇప్పటివరకు ఆయన తీసిన ఏ సినిమాకి మరో సినిమాతో పోలిక ఉండదు. ప్రతిసారి ఒక కొత్త నేపథ్యంతో సినిమా తీయడం ఆయన మార్క్. ఈసారి అనుష్కతో ఘాటీ సినిమా చేస్తున్నారు. వేదం తర్వాత క్రిష్%-%అనుష్క కాంబినేషన్ కావడంతో మంచి అంచనాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్ మరిన్ని ఆశలు రేపుతోంది. ఇప్పుడు ట్రైలర్ వదిలారు.

బ్రిటిష్ కాలంలో ప్రమాదకరమైన కొండప్రాంతాల్లో రోడ్లు నిర్మించిన తెగ ఘాటీ. అయితే ఇప్పుడా సమాజం కొండల్లో డ్రగ్స్ మోసే పనుల్లో చిక్కుకుపోయింది. తప్పు చేస్తున్నామనే గ్రహించి, ఈ చెడు వ్యవస్థకి ఎదురు నిలవడానికి రెడీ అవుతుంది అనుష్క. తన వాళ్లను ఈ ప్రమాదకర వ్యాపారం నుంచి ఎలా బయటకు తీసుకొచ్చింది? దీనికోసం ఎలాంటి పోరాటం చేసిందనేది ట్రైలర్ చాలా ఆసక్తికరంగా చూపించారు.

అనుష్కను మునుపెప్పుడూ చూడని వైల్డ్ అవతార్‌లో కనిపించింది. ఓ సామాన్య మహిళ నుంచి క్రిమినల్, లెజెండ్‌గా మారే పాత్ర ఈ కథకి కీలకం. 'సీత చేసే లంకా దహనం చూస్తారు' అనే డైలాగ్ ఆమె క్యారెక్టర్‌ను మరోస్థాయికి తీసుకెళ్లింది. విక్రమ్ ప్రభు, చైతన్య రావు, రవీంద్రన్ విజయ్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించారు. క్రిష్ జాగర్లమూడి యాక్షన్, ఎమోషన్‌తో పాటు కొత్త బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకొని ఈ కథను సిద్ధం చేయడం కొత్త అనుభూతిని కలిగించింది. సెప్టెంబర్ 5న థియేటర్స్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకి ట్రైలర్ మంచి జోష్ తీసుకొచ్చింది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...




# 'మిల్కీబ్యూటీ' అసలు సీక్రెట్ ఇదా!

పాల మీగడ లాంటి మేని ఛాయతో ఎప్పటికప్పుడు యువతను అలరిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది తమన్నా భాటియా. అంతేకాదు తన అందంతో మిల్కీ బ్యూటీగా కూడా పేరు దక్కించుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 17 సంవత్సరాలకు పైగానే అవుతున్నా.. అదే అందంతో.. అదే క్రేజ్‌తో దూసుకుపోతోంది. సినిమాలలో ఈ మధ్యకాలంలో హీరోయిన్‌గా అవకాశాలు లేకపోయినా.. స్పెషల్ సాంగ్ లలో నర్తిస్తూ ఇండస్ట్రీలో తన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే తమన్నా ఇన్నేళ్లయినా.. ఇంతే అందంగా.. ఇంతే యవ్వనంగా కనిపించడం వెనుక అసలు కారణం ఏంటి? అని.. ఈ మిల్కీ బ్యూటీ అసలు సీక్రెట్ ఏంటో తెలుసుకోవాలని అభిమానులు కూడా ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై ఊహించని కామెంట్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాదు తమన్నా చెప్పిన ఆ బ్యూటీ సీక్రెట్ విని కొంతమంది నెటిజన్స్ అసహ్యించుకోవడం ఇప్పుడు వైరల్‌గా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ఒక వెబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర అంశాలు పంచుకున్న తమన్నా తన బ్యూటీ సీక్రెట్ కూడా చెప్పేసింది. ఇంటర్వ్యూలో భాగంగా.." మీరు మొటిమలు తగ్గించుకోవడానికి ఏం చేస్తారు?" అని అడగగా.. దీనికి తమన్నా స్పందిస్తూ.." ఉదయం లేవగానే బ్రష్ చేయకముందే నా నోటిలో ఉండే సలైవా (ఉమ్మి) మొటిమలపై రాసుకుంటాను. అవి క్రమంగా తగ్గిపోతాయి. ఇది నాకు వ్యక్తిగతంగా బాగా వర్కౌట్ అయింది. ముఖ్యంగా దీని వెనుక సైన్స్ కూడా ఉందని నేను నమ్ముతున్నాను. ఎందుకంటే ఉదయం లేవగానే వచ్చే సలైవా (ఉమ్మి)లో యాంటీ బ్యాక్టీరియా ఉంటుంది. ఇది మొటిమలను, మొటిమల తాలూకు మచ్చల్ని కూడా తొలగిస్తుంది" అంటూ చెప్పుకొచ్చింది. ఈ విషయం వైరల్ అవ్వడంతో.. దీనిపై నెటిజన్స్ పలురకాలుగా స్పందిస్తున్నారు. కొంతమంది లాలాజలాన్ని ముఖంపై రాసుకోవడం ఏంటి? అని అసహ్యించుకుంటుంటే.. మరికొంతమంది వేలకు వేలు ఖర్చుపెట్టి క్రీములు ఉపయోగించినా తగ్గని సమస్య.. ఉమ్మితో తగ్గిపోతుందా అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే తమన్నా ఈ చిట్కా చెప్పడం ఇదేం మొదటిసారి కాదు.. 2021 లో కూడా ఇదే కామెంట్ చేసింది. అప్పుడు కూడా ఇలాంటి వార్తలు వైరల్ అవ్వడంతో గత ఏడాది డిసెంబర్లో ఎయిమ్స్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ గార్గి తనేజా ఒక వీడియో షేర్ చేస్తూ అసలు విషయం చెప్పుకొచ్చారు.



- తుపాకి.కామ్ సౌజన్యంతో..



- అనేక కారణాల వల్ల మానసిక రుగ్మతలున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. వీటిపై జనాలకు అవగాహన లేదు. వీటిలో చాలా వాటికి పూర్తిస్థాయి చికిత్స లేదు. మందులు వేసుకొంటూ.. మేనేజ్ చేసుకొంటూ ముందుకు సాగడమే.
- 'పూర్తిగా నయం కాదు' అని డాక్టర్లు చెప్పరు. చెబితే తమపై నమ్మకం కోల్పోయి వేరే చోటుకు చికిత్సకు వెళతారని వారి భయం. పేషంట్లను పోగొట్టుకోరు కదా..!
- ఇంట్లో ఒక మానసిక రోగి ఉంటే ఆ ఇంటి వారి బతుకు నిత్య నరకం.

## బైపోలార్ డిజార్డర్.. స్కిజోపేర్నియా..

## అన్నిటికి హ్యాపీ ఎండింగ్ ఉండదు



# ఊబిలో చిక్కుకోవద్దు..!

పదిహేనేళ్ల అమ్మాయి ఏడుస్తూ.. 'మా అమ్మ దారుణంగా ప్రవర్తిస్తోంది సార్.. వస్తువులను పగలకొడుతుంది.. దాడి చేస్తుంది.. బాగా ఆనందంగా ఉంటుంది.. ఉన్నట్టుండి హింసాత్మకంగా ప్రవర్తిస్తుంది.. అనుమానిస్తుంది.. మీరెవరూ నన్ను పటించుకోవడం లేదు.. నేను చచ్చిపోతాను అని మొన్న కత్తి తీసుకొంది.' వద్దమ్మా.. అని అడ్డుపడిన మా తాత (ఆమె తండ్రి)ని అయిదారు సార్లు పొడిచేసింది. చచ్చిపోతాను అంటుంది. ఏమి చెయ్యాలో చెప్పండి సార్

'నువ్వు చెప్పిన దాని బట్టి మీ అమ్మకు బై పోలార్ డిసార్డర్ ఉంది. మందులు వేసుకొంటూ మేనేజ్ చేసుకొంటూ ఉండాలి. కాసేపు వెన్నెలంత చల్లని ఆనందం.. వెంటనే అనుమానం.. అగ్రేషన్. అది అంతే. చికిత్స లేదు. ఆమె మనసు నొప్పించకుండా పొగుడుతూ సాగాలి. నువ్వు భరించలేవు. అసలే పదో తరగతి. ఎక్కడైనా హాస్టల్‌లో చేరు. మీ నాన్న తెలివిగా తప్పించుకున్నాడు. కన్న పాపానికి మీ అవ్వ, తాత భరించకతప్పదు. మనసు దిట్టం చేసుకో.. ఎప్పుడో ఒక రోజు మీ అమ్మ ఆత్మహత్య చేసుకొనే అవకాశం ఎక్కువ. ఇప్పుడు నేను నీ కంటికి రాక్షసుడిలా అనిపించవచ్చు. నిజం మహా చేదుగా ఉంటుంది. చెప్పక తప్పదు.'

***(ఈ సంభాషణ జరిగి నలభై రోజులు.)***

నిన్న ఇంకోటి..

వివాహిత మేనమామ నన్ను కలిసాడు. ఇక్కడా సేమ్ టు సేమ్. 'ఆమెకు ఇస్తున్న మందుల ప్రిస్క్రిప్షన్ జాగ్రత్తగా ఫైల్ చెయ్యండి. వీలైతే పోలీస్ స్టేషన్‌లో ఒక కంప్లైంట్. మా ఇంట్లో ఇలాంటి ఒక పేషంట్ ఉంది. అమ్మను గత ఆరునెలల్లో కనీసం పదిసార్లు మెడ పట్టుకొని చంపబోయింది. కన్న పాపానికి తల్లి జీవచ్ఛవంలా మారింది. మెడ చుట్టూ నల్లటి గాయపు మరకలు. అయినా ఓపికగా మేము చూసుకొంటున్నాము.. అని కంప్లెయింట్‌లో రాయండి. ఆమె ఆత్మహత్య చేసుకొంటే ఇది మీకు రక్షణగా ఉంటుంది. లేదంటే మీరు చంపేశారని బెదిరించి మీ దగ్గర లక్షలు లాగేస్తారు బ్లాక్‌మెయిల్‌ను బతుకుగా చేసుకొన్న కొందరు మీడియా వారు.. పోలీసులు.. బతికి మిమ్మల్ని చంపుతోంది. చచ్చి ఇంకా చంపే అవకాశం' అని చెప్పాను.

బైపోలార్ డిజార్డర్.. స్కిజోపేర్నియా.. లాంటి వ్యాధులు ఉన్నవారు అందరూ ఆత్మహత్య చేసుకొంటారు అని కాదు. ఆత్మహత్య చేసుకొన్న వారందరూ ఇలాంటి వారే అని కాదు.

ఇంకో కేసు.. పైన చెప్పిన రెండు కేసుల్లో భర్తలు దూరం జరిగిపోయారు.. ఈ కేసులో భర్త బలైపోయాడు.

బై పోలార్ డిజార్డర్ స్త్రీ.. మామూలు సమయాల్లో చక్కగా చలాకీగా ఉండేది. ఎవరికీ అనుమానం రాదు. ఒక్కోసారి ఎక్స్‌ట్రీమ్ రియాక్షన్. ఆరు నెలల్లో నాలుగు సార్లు ఆత్మహత్యకు పాల్పడింది. భర్త తప్పు లేదని కాదు. ఉండొచ్చు. అంత లోతైన వివరాలు మనకు తెలిసే అవకాశం లేదు. చివరకు ఆమె ఆత్మహత్యా ప్రయత్నం ఫలించింది. ఆమెకు మానసిక రుగ్మత ఉందనే విషయం ఎవరికీ తెలియకుండా పోయింది. భర్త బలైపోయాడు. బహుశా ఇప్పట్లో జైలు నుంచి బయటకు రాలేడు.

పైన చెప్పిన మూడు కేసుల్లో ముగ్గురు స్త్రీలు. ముగ్గురికీ బైపోలార్. దీని అర్థం కేవలం మహిళలే దీని బారిన పడతారని కాదు.. మహిళల్లో కాస్త అధికం. అంతే. భార్యభర్తల్లో ఒకరికి ఇలాంటి సమస్య ఉంటే.. వారిని వదిలెయ్యమని నేను చెప్పడం లేదు. తగిన జాగ్రత్తలు తీసుకొండి అని మాత్రమే చెబుతున్నా.

నా ఫేస్‌బుక్ ఫాలోవర్స్‌లో ఆక్టివ్‌గా ఉండే ఒకాయన. ఈ పోస్ట్ కచ్చితంగా చూస్తారు కూడా. ఆయన భార్యకు స్కిజోపేర్నియా. రెండేళ్ల క్రితం మెసేజ్ చేసారు.

'సార్ వదిలెయ్యాలి అనుకొంటున్నా అని'.

'అయ్యో.. పాపం అలాంటివారు పసిపిల్లలతో సమానం. ఇలా చెయ్యండి అని చెప్పా. ఇప్పుడు వారి దాంపత్యం హ్యాపీగా సాగిపోతోంది. అన్ని కేసుల్లో పరిష్కారం ఇంత సులభం కాదనుకోండి.

బైపోలార్ వాళ్లు టెన్త్, ఇంటర్ దాక చురుకైన వారుగా చదువుల్లో మంచి ర్యాంక్ తెచ్చుకొంటూ వుంటారు. ఇక అప్పుడు మొదలవుతుంది. అప్పటి నుంచి ఇక ఇంట్లో నరకం మొదలు. పైన చెప్పినట్టు ఆత్మహత్య చేసుకొనే అవకాశం, లేదా గుండెపోటు.. వీరు తీసుకొనే మందుల సైడ్ రియాక్షన్. మిగతా వారికంటే 20-25 ఏళ్లు ముందుగా పోతారు. అప్పటిదాక వారికి అంతకంటే వారి ఇంటి వారికి వెయ్యి రెట్లు నిత్య నరకం.



**పగవాడికి కూడా ఇలాంటి బాధలు వద్దు.**

1. మేనరికం వివాహాలు వద్దే వద్దు.
2. బైపోలార్ వ్యాధి వున్నవారికి పెళ్లి చెయ్యొద్దు. పెళ్లి చేస్తే పిచ్చి కుదరడం కాదు.. పుట్టే పిల్లలకు మరింత ఎక్కువ స్థాయిలో ఉండే అవకాశం.
3. మెడికల్ ట్రామా కేసులు. ఏదో ఒక వ్యాధితో ఐసీయూలో.. అక్కడ వారు ఇచ్చే మందులు.. ఇది వరకే జన్యుపరంగా ఉన్న విత్తనాలు మొలకెత్తుతాయి. అప్పుడే పొయ్యుంటే బాగుండు అనుకొంటూ ఇంట్లోవారు మింగలేక కక్కలేక.

అన్నిటికి హ్యాపీ ఎండింగ్ ఉండదు. అదే జీవితం. ఒకటి నిజం. ఆటిజం.. ఏడీహెచ్‌డి.. ఇవి ఒక రకం సమస్యలు. బైపోలార్.. లాంటి మెంటల్ డిసార్డర్స్. వీటిపై జనాల్లో కనీస స్థాయి అవగాహన లేదు. దీనితో ఒక పక్క దోపిడీ... మరోపక్క నరకప్రాయపు జీవితాలు.

- అమర్నాథ్ వాసిరెడ్డి




# ఫోర్బ్స్ బిలియనీర్స్‌ని మించి..

# ఆ కుర్రాడి ఆస్తి

**ఒక అనామకుడు ఒక్క రోజులో ఫోర్బ్స్ జాబితాలో ఉన్న బిలియనీర్స్‌ను మించిన ధనవంతుడయ్యాడు. ఇంకేం పెద్ద వార్తయ్యాడు. అసలేం జరిగిందో బ్యాంక్ అధికారులే తలపట్టుకున్న ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలోనూ చక్కర్లు కొడుతోంది.**

ఉత్తరప్రదేశ్ గ్రేటర్ నోయిడాకు చెందిన దీపక్ అనే 20 ఏళ్ల కుర్రాడికి వచ్చిన ఓ టెక్స్ట్ మెస్సేజ్ అతణ్ని అవాక్కయ్యేలా చేసింది. చనిపోయిన తన తల్లి ఖాతాలో తను లెక్కించలేనన్ని సున్నాలతో జమైన ఆ డబ్బు చూసి నివ్వెరపోయిన ఆ కుర్రాడు ఓసారి తనకు తాను గిల్లుకుని.. ఆ మెస్సేజ్‌ను తన స్నేహితులకు ఫార్వర్డ్ చేశాడు. ఆ తర్వాత వారికీ అంతుచిక్కకపోవడంతో ఏకంగా తన తల్లి బ్యాంక్ అకౌంట్ ఉన్న కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు వెళ్లి.. అక్కడి బ్యాంకర్స్‌కు చూపించాడు. దీపక్, తన స్నేహితులెలా ఐతే నివ్వెరపోయారో.. బ్యాంక్ అధికారులూ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ మెస్సేజ్ చూసి వారి నోట మాట కూడా రాలేని పరిస్థితెదురైంది. ఎందుకంటే, దీపక్ తల్లి బ్యాంక్ అకౌంట్‌కు వచ్చి జమైన మొత్తం విలువ 1 కోటి 13 లక్షల కోట్ల రూపాయలు.. అంటే బాలీవుడ్ బాద్షా షారూక్ ఖాన్ ఆస్తి కంటే కూడా 15వేల రెట్లెక్కువ. షారూక్ ఖాన్ ఆస్తి నికరవిలువ 7,438 కోట్లు. ఇంతకీ ఆ మొత్తం ఎంత అంటారా..? వంద డ్యూడెసిలినయన్లు.. అంకెల్లో.. **10,01,35,60,00,00,00,00,00,01,00,23,56,0 0,00,00,00,299 రూపాయలు..** అంటే 1 కోటి 13 లక్షల కోట్ల రూపాయలు. ఇప్పుడు కోటక్ మహీంద్రా బ్యాంకులో దీపక్ తల్లి పేరిట ఉన్న అకౌంట్‌లో డిపాజిట్ అయిన మొత్తం రహస్యమేంటన్నది తేలాల్సి ఉంది. దీపక్ గ్రేటర్ నోయిడాలోని డాంకోర్ గ్రామానికి చెందిన వ్యక్తి. తన తల్లి గాయత్రీదేవిని ఈ మధ్యే కోల్పోయాడు. ఆగస్టు 3వ తేదీన ఆమె బ్యాంక్ అకౌంట్‌లో ఏకంగా 1 కోటి 13 లక్షల కోట్ల రూపాయలు జమైనట్టుగా మెస్సేజ్ చూసిన దీపక్ అవాక్కయ్యాడు. బ్యాంక్ అధికారులకూ ఏమీ అర్థం కాక.. ఆ బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేసి పెట్టి.. వెంటనే ఆదాయపు పన్నుశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీపక్ బ్యాంక్ అధికారులను కలిసేముందే అసలా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయితుందా పరిశీలించాడు. కానీ, కాలేదు. తన తల్లి అకౌంట్ ఏమైనా హ్యాక్ అయిందానని అనుమానపడ్డాడు. అయితే అది ఏదైనా తెలియని అనామకుల నుంచి జరిగిన లావాదేవీ అయినా అయ్యుండాలి.. లేదా, ఏదైనా సాంకేతిక లోపంతో ఏర్పడిన ఎర్రర్ కారణమై ఉండొచ్చని బ్యాంకర్స్ భావిస్తున్నారు. కానీ సరైన కారణమేంటన్నది గుర్తించలేకపోయారు.

దీపక్‌కు జరిగన ఈ ఘటనతో అతడి ఫోన్ ఇప్పుడు నిరంతరం మోగుతూనే ఉందట. ఏం జరిగిందనే క్యూరియాసిటీ ఏర్పడటంతో పాటు.. వాట్సప్ గ్రూపుల్లోనూ దీపక్ ఇష్యూ చక్కర్లు కొడుతోంది. ఇక మీడియా నుంచి పెద్దఎత్తున ఫోన్స్ మోగుతూనే ఉన్నాయి. దాంతో ఆ ఫోన్ మోత భరించలేని దీపక్ ఏకంగా ఫోనే స్విచ్ ఆఫ్ చేసి పెట్టేశాడిప్పుడు.

ఇక సోషల్ మీడియా మీమ్స్‌కు దీపక్ ఘటన ఓ ఊతమైపోయింది. షారుక్ ఖాన్ నికర ఆస్తుల విలువ ఇప్పుడు దీపక్‌కు పాకెట్ మనీ అని ఒకరంటే.. ఇంకేం బ్రదర్, అంబానీని దాటిన గ్రేటర్ నోయిడా దీపక్ అని మీరు వార్తల్లోకెక్కాలని మరొకరు.. ఇలా దీపక్ ఇష్యూ ఓ హాట్ టాపిక్‌గా మారిపోయింది.

అయితే, దీపక్ తల్లి అకౌంట్‌లో జరిగిన ఆ లావాదేవీలో పైన మెస్సేజ్‌లో ఉన్నట్టు అంత డబ్బు అసలు ఉందా.. ఉంటే, ఆ ట్రాన్‌జాక్షన్ ఎలా జరిగింది? బ్యాంకర్స్ భావిస్తున్నట్టు ఏదైనా ఎర్రర్ వల్ల జరిగిన సాంకేతిక లోపమా.. అసలు విషయమేంటన్నది ఇంకా తేలాల్సి ఉంది.

- బాతాఖానీ సౌజన్యంతో..















# కొత్త కార్డుల సంతోషం సగమే!

మొదటిపేజీ తరువాయి

తేలికైంది. అలాగే ఈకేవైసీ నిర్వహించని వారికి రేషన్ నిలిపివేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల రేషన్‌కార్డుల సంఖ్యలో మార్పు లేకపోయినా యూనిట్ల విషయంలో వేలల్లో మార్పు ఉండవచ్చని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నాయి. కాగా వైకాపా హయాంలో ఒక్కసారి మాత్రమే తెల్ల కార్డుల జారీ ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత ఇప్పటి వరకు కొత్త కార్డులతోపాటు తెల్లకార్డుల్లో చేర్పులు, మార్పులు, సవరణలకూ అవకాశం లేకుండా పోయింది. గత ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్తగా కార్డులు జారీ చేయాలని నిర్ణయించడంతో వాటి కోసమే ఎదురుచూస్తున్న వారు సంతోషించారు. ఆమేరకు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డుల కోసమే కాకుండా చిరునామా మార్పు, కార్డులో చేర్పులు, ఆధార్‌లో తప్పుల సవరణ, కొత్తగా యూనిట్ల చేర్పులు, యూనిట్ల తొలగింపు, యూనిట్లు స్ప్లిట్, కార్డులు సరెండర్‌కు జిల్లాలో 72,512 దరఖాస్తులు వచ్చాయి.

**ఇంకా ప్రకటించని అధికారులు**

కేటగిరీవారీగా చూస్తే.. తెల్లకార్డు కోసం 7,192 మంది దరఖాస్తు చేయగా 4,903 దరఖాస్తులను ఆమోదించి 2013 తిరస్కరించారు. మిగతా 276 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 45 మంది తమ తెల్లకార్డులను ప్రభుత్వానికి స్వాధీనపరిచారు. చిరునామా మార్పులకు 1,438 దరఖాస్తులు అందగా 1,433 అర్జీలను ఆమోదించి.. ఐదింటిని తిరస్కరించారు. కుటుంబ వివరాల మార్పునకు 1207 దరఖాస్తులు రాగా 871కి అప్రూవల్ లభించింది. 334 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టి రెండింటిని తిరస్కరించారు. కార్డుల్లో ఆధార్ తప్పులను సరిచేయాలని 1171 మంది దరఖాస్తు చేయగా 979 అప్రూవ్ చేసి మిగతావాటిని తిరస్కరించారు. కార్డులో పేర్లు చేర్చాలంటూ 50,671 దరఖాస్తులు రాగా 41,232 మందిని చేర్చి మిగతా వాటిని తిరస్కరించి కొన్నింటిని పెండింగ్‌లో పెట్టారు. యూనిట్ల తొలగింపునకు 1485 దరఖాస్తులు అందగా 1267 అర్జీలకే ఆమోదం లభించింది. కార్డు విభజనకు 8,209 మంది దరఖాస్తు చేయగా 6,513 ఆమోదించి 1145 తిరస్కరించి, 551 పెండిండ్‌లో పెట్టారు. వీటి ఆధారంగా రూపొందించిన కొత్త స్మార్ట్ కార్డులను ఈ నెల 25 నుంచి పంపిణీ చేయనున్నారు. అయితే మొత్తంగా జిల్లాలో కొత్తగా ఎన్ని రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారన్నది అధికారులు ఇంకా వెల్లడించకపోయినా కొత్త కార్డులతోనే సెప్టెంబర్ నెల నుంచి రేషన్ పంపిణీ చేస్తారని పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

# ఉందిగా కోర్టు సాకు.. చేసేద్దాం ఆ సొమ్ముతో సోకు!

మొదటిపేజీ తరువాయి

మెటీరియల్ కొనుగోలు చేశారు. ఆ మేరకు వీరికి బిల్లులు చెల్లించాల్సి ఉంది. కానీ ఎప్పటికీ చెల్లింపులు జరగకపోవడంతో సంబంధిత సంస్థ కోర్టును ఆశ్రయించి బిల్లులు చెల్లించేలా ఆదేశాలు తెచ్చుకుంది. అయితే దాన్ని కూడా ఆ తర్వాత వచ్చిన అధికారులు పట్టించుకోలేదు. మళ్లీ హన్షిత ఎంటర్‌ప్రైజెస్ కోర్టు ధిక్కరణ కింద మరో కేసు వేసింది. దీంతో ఎస్‌బీఐలో ఉన్న వడ్డీ సొమ్ములో రూ.18లక్షలు హన్షిత ఎంటర్‌ప్రైజెస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. వాస్తవానికి కోర్టు కంటెంప్ట్ కేసు కాబట్టి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకే కొనుగోలు చేపట్టారు కాబట్టి ఈ బిల్లులు వేరే నిధుల నుంచి చెల్లించాలి. లేదూ అంటే కోర్టు ధిక్కరణ కింద కేసు ఉంది కాబట్టి ఎస్‌బీఐలో ఉన్న 240 హెడ్ నుంచి వడ్డీని విత్‌డ్రా చేసుకోడానికి అనుమతి ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్‌కు రాయాలి. ఒకవేళ ఈమేరకు అనుమతులు ఇవ్వకపోతే హైకోర్టు ధిక్కరణ కింద వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ అధికారులే కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇక్కడ బాబూరావే వడ్డీ డబ్బులు విత్‌డ్రా చేశారు. పోనీ బిల్లుల చెల్లింపులోనైనా పారదర్శకత పాటించారా..? అంటే అదీ లేదు. దాదాపు రూ.18 లక్షలు పైబడి బిల్లులు చెల్లించినపుడు టీడీఎస్ 5 శాతం కట్ చేయాలి. దీని వల్ల దాదాపు రూ.50వేలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అది కూడా చేయలేదు. ఆ తర్వాత ఎలాగూ వడ్డీ డబ్బులు తీయడం మొదలుపెట్టాం కాబట్టి, నెమ్మదిగా కార్యాలయ ఖర్చులు ఒడ్డెక్కించేద్దామన్న భావనతో ఇటీవల మళ్లీ 2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విత్‌డ్రా చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కొంతమేర విద్యుత్‌వైర్లు ఆమధ్య పాడైపోయాయి. పనిలో పనిగా ఒక టీవీ, ఒక ఏసీ ఈ డబ్బులతో కొనుగోలు చేశారు. వాస్తవానికి లక్ష రూపాయలు పైబడిన పనులు చేపట్టాలంటే ఏపీహెచ్‌ఎంఐడీసీ సంస్థ చేపట్టాలి. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల కల్పన కోసం ఈ విభాగం పని చేస్తుంటుంది. వారికి చెబితే అంచనాలు తయారుచేసి రిపేరు పనులు చేస్తారు. అలా కాకుండా దాదాపు రూ.3 లక్షల పనులను వీరే సొంతంగా తయారుచేసేశారు. స్థానికంగా వైర్లు కొనుగోలు చేశారని, వీటిలో నాణ్యత లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. స్థానికంగా బిల్లులు తయారు చేసి అకౌంటెంట్, ఏవోలు డీఎంహెచ్‌వో అండదండలతో ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

# పాండ్రంకి సోదరుడికి నామినేటెడ్ పోస్టు

✔ కోటేశ్వరాలయం చైర్మన్‌గా నియామకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకర్తలుగా కొనసాగుతూ సీనియర్ నాయకులుగా ఎదిగిన కాపు సామాజిక వర్గానికి చెందిన మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ సోదరుడు దేవేంద్రనాయుడుకు అధిష్టానం నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. గుడివీధి నాగావళి తీరంలో ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన ఉమారుద్ర కోటేశ్వరాలయం పాలకమండలి చైర్మన్‌గా దేవేంద్రనాయుడిని నియమిస్తూ దేవదాయశాఖ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీకి విధేయులుగా కొనసాగుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి ఓటర్లను ఆకర్షింపజేసి గొండు శంకర్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పాండ్రంకి సోదరులు కీలకభూమిక పోషించారు. అంతకుముందు నగరంలో గొండు శంకర్ టీడీపీ కార్యక్రమాలు స్వతంత్రంగా నిర్వహించడానికి పాండ్రంకి సోదరులు బహిరంగంగా మద్దతు తెలిపి ఆయన వెంట నిలబడ్డారు. ఆ కృతజ్ఞతతోనే దేవేంద్ర నాయుడికి రెండోసారి కోటేశ్వరాయలం చైర్మన్ వరించింది. 2000-02 మధ్య టీడీపీ హయాంలోనే దేవేంద్రనాయుడు కోటేశ్వరాలయం చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆలయంలో శివలింగాన్ని పునఃప్రతిష్ట చేశారు. ఆలయ అభివృద్ధికి దాతల చొరవతో రూ.32లక్షలు ఖర్చుచేసి సందర్శకులు, భక్తులకు అనువుగా సౌకర్యాలను పెంచారు. ఆలయ పరసర ప్రాంతాలను అభివృద్ధి చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా పార్టీ విజయానికి కృషిచేసిన తనకు పాలక మండలి చైర్మన్‌గా నియమించడం పట్ల ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నామినేటెడ్ పోస్టుకు ఎంపిక చేయడానికి అన్నివిధాల సహకరించి కోటేశ్వరస్వామి సేవ చేసే భాగ్యం కల్పించిన రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నగర టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టీడీపీ నాయకులు తంగి సూర్యారావు, బూర్లె రమణమ్మ, ఎంవీఆర్ మూర్తి ఉన్నారు.

*పాలకమండలిలో 9 మంది:* ఉమారుద్ర కోటేశ్వరాలయం పాలక మండలిలో చైర్మన్‌తో పాటు 9 మందికి అవకాశం కల్పించారు. వీరిలో ఆరుగురు బీసీలు, ఇద్దరు ఓసీలు, ఒకరు ఎస్సీ ఉన్నారు. చైర్మన్ పాండ్రంకి దేవేంద్రనాయుడు (కాపు), సభ్యులుగా కోరాడ రమేష్ (కళింగవైశ్య), కొంద్ర ఆరుణ (యాదవ), జంపాన శివరామరాజు (క్షత్రియ), పిట్ట గురుచరణ్ (యాదవ), పంతులు శేఖర్ (బ్రాహ్మణ), కటారి కమల (గుడారి), పొదిలాపు అమరవాణి (నాయీబ్రాహ్మణ), సాలిహుండం శ్రీదేవి (పట్నాయక్) ఉన్నారు.

# జిల్లాస్థాయి యోగాసన పోటీల్లో అద్భుత ప్రదర్శన



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం విద్యార్థులు జిల్లాస్థాయి నేషనల్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ శ్రీకాకుళం కాంపిటీషన్స్ నరసన్నపేటలో గోల్డ్‌మెడల్ సాధించి అద్భుత ప్రదర్శన చేశారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ట్రిపుల్ ఐటీ విద్యార్ధులు మెడల్స్ గెలుచుకున్నారు. డైరెక్టర్ బాలాజి మాట్లాడుతూ ఇంకా ఉన్నత స్థాయికి చేరుకొని నేషనల్ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని చెప్పారు. గోల్డ్ 29, సిల్వర్ 6, గెలుచుకొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి గేదెల, యోగా విభాగపతి ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, యోగ ధనుంజయరావు, ఉద్యోగులు, సహోద్యోగులు అభినందనలు తెలిపారు.

# తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోండి

☆ ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి
☆ సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి
☆ తుమ్మావీధి అంగన్వాడీలో అవగాహన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలని, బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివని సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ పరిధి కృష్ణా పార్క్ సెక్టార్ తుమ్మావీధి అంగన్వాడీ కేంద్రంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాణి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి ఆధ్యర్యంలో తల్లిపాల వారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేశారు. తల్లి పాలు సంపూర్ణ ఆహారమని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయన్నారు. బిడ్డకు మొదటి 6 నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారమన్నారు. వార్డు ఇన్‌ఛార్జి జోగ నూకరాజు యాదవ్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. టీచర్ బి.సంధ్యారాణి, ప్రసూన, సునీత, ఆయా రోజా, ఆర్పీలు, ఆశ వర్కర్లు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# బోస్టన్‌లో ఎమ్మెల్యే కూన రవి కుమార్



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

అమెరికాలోని బోస్టన్ నగరంలో జరిగిన 50వ జాతీయ రాష్ట్ర శాసనసభల సదస్సు (ఎన్సీఎస్‌ఎల్)లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఆమదాలవలస ఎమ్మెల్యే, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ అధ్యక్షుడు కూన రవి కుమార్ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రజాస్వామ్య దేశాల ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సదస్సు తర్వాత, ఆయన భారత శాసనసభ బృందంతో కలిసి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, "ఇలాంటి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం చాలా గర్వంగా ఉందన్నారు. వివిధ దేశాల ప్రజాస్వామ్య విధానాలను తెలుసుకోవడానికి ఇదొక మంచి అవకాశమన్నారు. అమెరికా రాజకీయ వ్యవస్థను దగ్గరగా చూసి చాలా విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. సదస్సులో అమెరికా జాతీయ రాష్ట్ర శాసనసభల సంఘ అధ్యక్షుడు వెయిన్‌తో రవి కుమార్ మాట్లాడారు. తర్వాత, భారత బృందంతో కలిసి బోస్టన్‌లోని కొన్ని చారిత్రక కట్టడాలను కూడా చూశారు.

# గణపతి ఉత్సవాలకు శ్రీకారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని తుమ్మావీధి మెహర్ బాబా మందిరం సమీపంలో ఈనెల 27 నుంచి సెప్టెంబర్ నాల్గవ తేదీ వరకు గణపతినవరాత్రులు నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ చైర్మన్ డబ్బీరు సుమంత్ తెలిపారు. 18 అడుగులు ఎత్తు గణపతి విగ్రహం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు అర్చకుల సూచన మేరకు గురువారం పందిరిరాట వేశామన్నారు. కళాత్మకంగా విగ్రహం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. నగర ప్రజలకు మంచి జరగాలని నవరాత్రులు నిర్వహిస్తున్నామన్నారు. మెహర్‌వీధి, కత్తెర వీధి ప్రజల సహకారంతో చేపడుతున్న ఉత్సవాల్లో నగర ప్రజలు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో సుహాసిని, రమాదేవి, మాధురి కమిటీ కార్యవర్గ సభ్యులు సూర్యారావు, రామ్మోహన్, విజయ్‌శంకర్, వినోద్, చంటి, శరత్, జగన్ తదితరులు పాల్గొన్నారు



# చేనేత కార్మికులకు శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గొలివి కరుణాకర రావు శ్రీకాకుళం జిల్లా చేనేత కార్మికులకు వివిధ చేనేత ఉత్పత్తి సంస్థల ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో చేనేతరంగాన్ని కాపాడి,అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్రంలో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, సమగ్ర చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం, చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సరఫరా పథకం మొదలైన ఈ పథకాల కింద ముడి పదార్థాలు, మగ్గాలు, ఉపకారణాల కొనుగోలు, డిజైన్ల ఆవిష్కరణ, ఉత్పత్తుల ప్రాజెక్టు వైవిధ్యేకరణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నైపుణ్యాభివృద్ధి మొదలైన వాటికోసం ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి గ్రామాన ఉన్న చేనేత కార్మిక కుటుంబాలకు అందే పరిస్థితులు కల్పించబడాలని, ఈ దిశగా వారి కుటుంబాలు ఆర్థిక సంపన్నం కావడానికి సంబంధిత అధికార సంస్థలు స్వచ్ఛంద సంస్థలు చేనేత కార్మిక సంస్థలు పూనుకోవాలన్నారు.

# బదిలీ ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపాధ్యాయుల సేవలు, వెలకట్టనిదని, గురువు స్థానం, దైవత్వమని ఉపవిద్యాశాఖాధికారిణి విజయకుమారి గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీ పొంది, వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు పి.రవికుమార్, బి.విజయకుమార్, ఐ.రేవతి, ఎస్.అరుణ, ఎం.సునీత, కె.శ్యామసుందరరావు, పి.భాగ్యలక్ష్మి, ఎస్.సందీప్‌లకు ప్రధానోపాధ్యాయురాలు, ఉపవిద్యాశాఖాధికారిణి విజయకుమారి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ మొదటి దైవం గురువేనని, విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ, వారిని ఉన్నత స్థానంలో నిలిపే బాధ్యతను, తన భుజానవేసుకొని సుస్థిర స్థానంలో నిలపటం ఒక్క గురువుకే సాధ్యమన్నారు. అనంతరం బదిలీపై వెళ్లే ఉపాధ్యాయులను, దుస్సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎన్.గోవిందరావు, పాఠశాల కార్యదర్శి కె.తేజేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కరుణాసాగర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# 'వీర్ పరివార్ సహాయత యోజన, 2025' ప్రారంభం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వీర్ పరివార్ సహాయత యోజన, 2025' పథకాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద రెల్లివీధిలో జిల్లా సైనిక సంక్షేమ సంఘంలో ప్రారంభించారని డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం ప్రెసిడెంట్ పూర్ణచంద్రరావు కటకం మీడియాకి తెలియజేశారు. జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ ఈ యొక్క లీగల్ సర్వీస్ క్లినిక్ నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్యానెల్ లాయర్, పారాలీగల్ వాలంటీర్‌ని నియమించామన్నారు. వీరి సేవలను స్థానిక సైనిక్ వెల్ఫేర్ బోర్డులో పదవీ విరమణ చేసిన సైనికులు, వారి కుటుంబసభ్యులు వారి న్యాయపరమైన సేవలను అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్యానల్ అడ్వకేట్ వి.జ్యోతిర్మయి, పారా లీగల్ వాలంటీర్ కె.ఆదిత్యకుమార్, అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, ఇన్చార్జి సూపరిండెంట్ ఎస్.ఈశ్వరరావు, సైనిక సంక్షేమ కార్యాలయం, డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, జనరల్ సెక్రటరీ పి. మురళీధరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామక్రిష్ణ, కోశాధికారి ఎం.సింహాచలం, లీగల్ అడ్వైజర్ పైడి విశ్వేశ్వరరావు, సీపాన రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎ.వి.జగన్మోహన్‌రావు, పి.శ్రీనివాసరావు, వి.గౌరీశంకర్, బి. రాంబాబు, పి.పద్మావతి, జిల్లాలో గల మాజీ సైనికులు వారి కుటుంబసభ్యులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ప్రతినిధులు బెండి సుధాకర్, భైరి మురళి, దుంపల శాంతమ్మ పాల్గొన్నారు.



# ప్రతీ ఒక్కరూ సామాజిక సేవలో భాగమవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ ఒక్కరూ సామాజిక సేవలో భాగమవ్వాలని, నిస్సహాయులకు ఆదుకోవటమే మాధవసేవని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ గురువారం అన్నారు. నగరంలో ఉండే నిస్సహాయులకు, పేదలకు, స్థానిక మంగువారితోట పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ అన్నవితరణచేపట్టారు. ఇందులో భాగంగా నైట్‌షెల్టర్‌లో అభాగ్యులకు కొంక్యాన వేణుగోపాల్ చేతులమీదుగా అల్పాహారం, ఫలాలను అందించి, మాట్లాడుతూ ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ ఆలోచన స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంతభాగం సేవలకు వినియోగించాలని, అందులో ఉండే ఆత్మసంతృప్తి వేరన్నారు. నైట్ షెల్టర్ నివాసకులలో వృద్ధులు, అనారోగ్యులున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 11న ఉచిత వైద్యశిబిరాన్ని, దంత శిబిరాన్ని, లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు. వీరికే కాకుండా గొంటి వీధి పరిసర ప్రాంతాల రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గతంలో ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని, ప్రస్తుతం నైట్ షెల్టర్ చీకటిమయంగా ఉందని, మున్సిపల్ అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నైట్ షెల్టర్ నిర్వాహకులు, చేయుతమేమున్నాం అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మి, సంఘ సేవకులు పైడి గోపాలరావు, ఉర్లం శివతేజ, పోలీస్ డిపార్ట్మెంట్ లోపింటి శాంతారావు, రాజు, వృద్ధులు, నిరుపేదలు, సంచార జాతులకు చెందినవారున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.